క్లుప్తంగా

ఉపాధిపై సమీక్ష



మాట్లాడుతున్న రాసరాయరాయుడు

ఏర్పేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు ఓ వరమని అంబుడ్స్‌మెన్ రాసరాయరాయుడు అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. కూలీలకు రోజుకు రూ.272 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలు ఇవ్వాలన్నారు. ప్రతి పంచాయతీలో రోజుకు వంద మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల పొలాల్లో పండ్లు, పూల తోటల పెంపకం సాగు చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులతో వలసలు ఆగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీ రావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చండీ రుద్రయాగంలో శ్రీకాళహస్తి ప్రచార రథం



రేణిగుంట: విజయవాడలో శుక్రవారం శ్రీ చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభమైంది. 17వ తేదీ వరకు జరగనున్న ఈ యజ్ఞంలో శ్రీకాళహస్తి దేవస్థానం ప్రచార రథం పాల్గొంది. శ్రీకాళహస్తి దేవస్థానం ప్రతిబింబంతో కూడిన ప్రచార రథంలో స్వామి, అమ్మవార్ల ప్రతిమలను అక్కడి భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాధికారులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపు



మురుగును తొలగిస్తున్న జేసీబీ

ఏర్పేడు: మండలంలో కోబాక పంచాయతీలోని గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికను జేసీబీతో తొలగించారు. శుక్రవారం సర్పంచ్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

ఏర్పేడు: మండలంలోని అముడూరు పొలాల్లో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. మండలంలోని అముడూరుకు చెందిన మాధవయ్యపై భూవివాదాలతో గ్రామస్తులు వెంకటరత్నం, పెంచలయ్య దాడిచేసి గాయపరచినట్లు చెప్పారు. క్షతగాత్రుడ్ని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపినట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మండలంలోని చెల్లూరు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం రాత్రి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శ్రీకాళహస్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ మోహనకృష్ణ చెల్లూరు సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

నియామకం



బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి జిల్లా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా బీఎన్‌కండ్రిగకు చెందిన మావిళ్లపల్లి శివకుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యువమోర్చా బలోపేతానికి కృషి చేస్తానని శివకుమార్ పేర్కొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు బదిలీ సన్మానం



దినేష్‌ను సన్మానిస్తున్న మహిళా సంఘాలు

తొట్టంబేడు (రేణిగుంట): సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దినేష్ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల మహిళా సమైఖ్య భవనంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించాకు. ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ డాంగే యాదవ్, మండల సమైఖ్య అధ్యక్షురాలు సునీత దినేష్ సేవలను కొనియాడారు. అలాగే నూతన మేనేజర్ ప్రతాప్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ఏపీఎం గురుమూర్తి, మహిళా సమైఖ్య నాయకురాలు అమరావతి, మునెమ్మ, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

తిరుపతి గంగజాతరకు శ్రీకాళహస్తి దేవస్థానం సారె



సారె సమర్పిస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా గురువారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా సారెను అందజేశారు. వీరికి తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం చైర్మన్ గోపియాదవ్, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దంపతులు పట్టువస్త్రాలను సాంప్రదాయపద్ధతిలో గంగమ్మకు సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ఆ వస్త్రాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించే భాగ్యం తనకు కలగడం పూర్వజన్మ సుకృతమని అంజూరు చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, ఎస్‌కే బాబు, శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు జూలకంటి సుబ్బారావు, శ్రీదేవి, కొల్లూరు హరినాయుడు, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలు సద్వినియోగం చేసుకోండి



చిన్న పాండూరులో రైతు భరోసా మాస పత్రికలను రైతులకు పంపిణీ చేస్తున్న ఏఓ సుహర్‌లత

వరదయ్యపాళెం: రైతుల అవసరాలకు అనుగుణంగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి సుహర్‌లత కోరారు. శుక్రవారం మండలంలోని చిన్న పాండూరు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ మురళీ నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాదిని వ్యవసాయశాఖ ప్రకటించిందని, రైతులు వీటి సాగుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే పచ్చిరొట్ట విత్తనాలు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు తక్కువ ధరకే కాంప్లెక్స్ ఎరువులు, యూరియాను ప్రభుత్వం ఇస్తోందన్నారు. అనంతరం రైతు భరోసా మాస పత్రికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భువనేశ్వరి, విస్తరణ అధికారి రవి, స్థానిక సర్పంచ్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించిన ఆర్డీఓ



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్డీఓ రామారావు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేసి ఆయనకు ఆశీర్వచనాలు పలికారు.

సమ్మర్ క్యాంప్‌తో మరింత విజ్ఞానం



సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవి సెలవులలో స్కూళ్లలో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించటం వలన విద్యార్థులలో మరింత విజ్ఞానం పెరుగుతుందని సర్పంచ్ కోటమ్మ అన్నారు. శుక్రవారం పీవీకండ్రిగ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆమె టరల్ (టీఏఆర్‌ఎల్) సెలవుల్లో సరదాగా సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించి, వర్క్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు అబ్బులు మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు కథలు చెప్పించడం, చదివించడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్.. తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు యనమల ప్రసాద్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

15న ఉచిత ఖత్నా

గూడూరు: పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఈ నెల 15న మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ నిర్వహించనున్న సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ కోరారు. షాదీ మంజిల్‌లో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం నెట్‌వర్క్ కమిటీ సమావేశం నిర్వహించారు. రియాజ్ మాట్లాడుతూ ఏటా పేద ముస్లిం పిల్లల కోసం ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఖత్నాలో పాల్గొనే వారు ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నిపుణులైన వైద్యులతో ఈ ఖత్నా నిర్వహిస్తామని చెప్పారు. ఖత్నా చేయించుకున్నవారికి ఉచితంగా మందులతోపాటు, పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మోహనప్రియ

ఏర్పేడు: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మోహనప్రియ కోరారు. శుక్రవారం మండలంలోని ఎండీపుత్తూరులో పాపానాయుడుపేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామస్తులకు పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి జీవన సురక్ష, జీవనజ్యోతి పథకాలపై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. పాలసీ మొత్తం, ఏడాదికి కట్టాల్సిన ప్రీమియం సొమ్ము, పాలసీదారులు మరణిస్తే చెల్లించే బీమా సొమ్ము..ఇత్యాది వాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ అధికారి శశిధర్, సచివాలయ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జీవిత బీమాతో ధీమా

తొట్టంబేడు (రేణిగుంట): కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలు స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగకరమని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ దినేష్ అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండల సమైఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికపరమైన లావాదేవీలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నిరుపేదలకు బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పాలసీ టర్మ్ ఏడాది మాత్రమే ఉంటుందని, అందువల్ల మహిళలు ప్రతి ఏటా రూ.436 కట్టాలని చెప్పారు. పాలసీ తీసుకున్నవారు ఏ కారణం చేతనైనా మరణిస్తే..ఆ కుటుంబ సభ్యులకు లేదా నామినీకి రూ.2 లక్షల అందజేస్తారని వివరించారు.అలాగే తక్కువ ప్రీమియంతో కుటుంబానికి రూ. 2 లక్షల వరకు ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నూతన మేనేజర్ ప్రతాప్, స్వయం సహాయ సంఘాల సభ్యులు ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ డాంగే యాదవ్, ఏపీఎంలు గురుమూర్తి, దుర్వాసులు నాయుడు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ

రేణిగుంట: మండలంలోని కరకంబాడి అమరరాజ విద్యాలయం విద్యార్థులు గురువారం విడుదల చేసిన సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. తమ విద్యార్థులు సాయిదీపక్ 500మార్కులకు 454 మార్కులు, యశ్వంత్‌సాయి450, కల్పన 447 మార్కులు సాధించారని పేర్కొంది. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించింది.

అష్టమి పూజలకు పోటెత్తిన భక్తులు



అష్టమి పూజల్లో నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పిచ్చాటూరు: అష్టమి పురస్కరించుకుని మండలంలో రామగిరిలోని శ్రీ కాళికాదేవి సమేత సంతాన కాలభైరవ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఆలయంలో కొలువుదీరిన శ్రీకాళికాదేవి సమేత కాళభైరవ స్వామి, శ్రీ వాలీశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగకు ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు చేసి పలు రకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. మహిళలు ప్రమిదలు, గుమ్మడికాయలతో నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది భక్తులు అష్టమి పూజల్లో పాల్గొని స్వామివారి సేవలో తరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతలు భక్తులకు అన్నదానం చేశారు. మన రాష్ట్రం కన్నా తమిళనాడు ప్రజలు అధిక సంఖ్యలో ఈ పూజలకు వస్తున్నట్లు అర్చకులు చెప్పారు. ఇది పల్లవుల కాలం నాటి ప్రాచీన ఆలయం కావడం ఆలయంలో క్షేత్రపాలకునిగా కాలభైరవ స్వామి కొలువై ఉన్నారు. అష్టమి ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్, సిబ్బంది పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు: స్త్రీ–శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు: 3, హెల్పర్ పోస్టులు: 12 భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ దేవకుమారి తెలిపారు.

ఖాళీల వివరాలు

సత్యవేడు ఎస్టీ కాలనీలో ఎస్టీ, బుచ్చినాయుడుకండ్రిలో కాంపాళెం దళితవాడలో ఎస్సీ, కాటూరు అంగన్‌వాడీ కేంద్రం జనరల్‌కు కేటాయించారు. హెల్పర్ పోస్టులు: సత్యవేడులోని ఆర్సీపురం జనరల్‌కు, రాచపాళెం కేంద్రంకు బీసీ–బి, వరదయ్యపాళెం మండలం లక్ష్మీపురం జనరల్‌కు, కదూరు కేంద్రంలో జనరల్ కేటగిరిలో ఎస్సీకి కేటాయించారు. కురిజలంలో జనరల్‌లో బీసీ–బి, ఆర్ఆర్ పాళెం కేంద్రంకు జనరల్‌లో ఎస్టీ, గూడలవారిపాళెంలో ఓపెన్ కేటగిరికి, వరదయ్యపాళెం దళితవాడలో ఎస్సీ, కారిపాళెంలో బీసీ–బి, బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరు జనరల్ (ఓపెన్ కేటగిరి), ఆదిరెడ్డి కండ్రిగ ఓపెన్ కేటగిరికి కేటాయించారని సీడీపీఓ తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు స్థానికులై వివాహితులై ఉండాలని, 2023 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని, మే 20వ తేదీ లోపు దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని తెలియజేశారు.

శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో..

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి, రూరల్, తొట్టంబేడు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ వింధ్యావళ్లి శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నియోజకవర్గంలో1 అంగన్‌వాడీ కార్యకర్త, 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. శ్రీకాళహస్తి మండలం నారాయణపురంలో అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ), తొట్టంబేడు మండలం విరుపాక్షపురం(ఎస్టీ), బీడీ కాలనీ(ఓసీ) మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, అలాగే హెల్పర్లు పట్టణంలోని ముత్యాలమ్మగుడి(ఓసీ), తూర్పు కొండమిట్ట(బీసీ–బి), ఊరందూరు రోడ్డు(బీసీ–ఏ), తొట్టంబేడు మండలం రౌతు సూరమాల(ఎస్సీ), కొమ్మనగుంట(ఎస్సీ), కొత్తకండ్రిగ(ఓసీ), రాంబట్లపల్లె(బీసీ–బి), కొన్నలి(ఓసీ), చిలకవారి కండ్రిగ(ఓసీ)లో ఖాళీలు ఉన్నట్లు వివరించారు. పదవ తరగతి పాసై ఉండాలని, 21–35 ఏళ్ల వివాహితులు అర్హులని తెలిపారు. ఆ కేంద్రాల పరిధిలో టెన్త్ పాస్ అయిన వారు లేనిపక్షంలో 8వ తరగతి చదివిన వారు దరఖాస్తు చేయవచ్చన్నారు. దరఖాస్తులు తమ కార్యాలయంలో పొందవచ్చని, 20వ తేదీలోపు దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

బోరు మోటార్ల వైర్లు, స్టార్టర్లు చోరీ



దొంగలు కట్ చేసిన మోటారు వైరు, చోరీకి గురైన స్టార్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కారణిలోని పొలాలలోని 20కు పైగా వ్యవసాయ బోరు మోటార్ల వైర్లు, స్టార్టర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. చోరీపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫలితంగా పంటలకు నీరు పెట్టే పరిస్థితి లేక ఎండిపోతున్నాయని లబోదిబోమంటున్నారు. చోరీలతో సుమారు లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు చెప్పారు. మూడు నెలల క్రితం సైతం చోరీలు చేశారని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి ‘పినాకా’ ఉచిత శిక్షణ

నగరి: నిరుద్యోగ యువతకు పినాకా సంస్థ అధినేత బి.యాదగిరి ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుందని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు స్థానిక ఎస్‌జీఎస్ (జీహెచ్‌ఎస్) బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తారన్నారు. బ్యాంకింగ్, గ్రూప్ డిస్కషన్, సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పించి స్టడీ మెటీరియల్ కూడా ఇస్తారన్నారు. 2017 నుంచి ప్రతి ఏటా ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు, గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాదాపు వందమంది వరకు ఉచిత శిక్షణ ఇస్తారని, పూర్తి వివరాలకు కోర్సు డైరెక్టర్ 9394566440 (మునస్వామి) నంబరును సంప్రదించాలన్నారు.

కరుణించమ్మా గంగమ్మా!

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- తోటి వేషధారుల సందడి



కళాకారుల కళా ప్రదర్శన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కొంతమంది కుటుంబ సమేతంగా వచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. భక్తుల తోటి వేషాలతో నగర పురవీధులు హోరెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు తోటి వేషంతో భక్తులు సందడి నెలకొంది. చిన్నా పెద్ద తేడా లేకుండా గంగజాతర వేషధారణలతో గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. విశేష పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు దొర వేషం

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా నాలుగో రోజు శనివారం సంప్రదాయబద్ధంగా కైకాల, చాకలి కులస్తులు అనువంశికంగా దొర, మంత్రి వేషాలు వేస్తారు. వీరి పక్కన తోటివాడు పాలేగాడి కొయ్య శిరస్సును చేతపట్టుకుని ఉంటారు. వీరు దొర, మంత్రి వేషాలు ధరించి డప్పు వాయిద్యాల నడుమ నగరంలో తిరుగుతూ ఇంటింటా పూజలు అందుకుంటారు. ఈ వేషాలను భక్తులెవరూ వేయరు. గంగబొట్లు పెట్టుకుని, వేపాకు చేతపట్టి భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు.

కోలాహలంగా గంగమ్మ సారె ఊరేగింపు

తిరుపతి తుడా: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మకు మున్సిపల్ కార్పొరేషన్ తరపున శుక్రవారం అధికారికంగా సారె సమర్పించారు. సాయంత్రం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కళాబృందాల నృత్య ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణల మధ్య కోలాహలంగా సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్సీ సిపాయి

అధికారులు వివిధ వేషాలతో ఆకట్టుకున్నారు.

ప్రజలందరికీ అమ్మవారి దీవెనలు

తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ దీవెనలు నగర ప్రజలందరికీ ఉండాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ , రాతి కట్టడంతో పునర్నిర్మాణం చేసుకోవడంతోపాటు గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం శుభ పరిణామమన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సారె ఇవ్వడంతో నగర ప్రజలందరూ ఇచ్చినట్లేనన్నారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత సారెను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఆర్‌వోకేఎల్ వర్మ, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్ పి.రవి, మెప్మా కృష్ణవేణి, ఎస్.కె.బాబు, ఉమాఅజయ్ పాల్గొన్నారు.





సారె సమర్పణలో మేయర్ శిరీషతో ఎమ్మెల్సీ సిపాయి, వివిధ వేషధారణలో పిల్లలు





సారె తీసుకెళుతున్న మహిళలు, సారె తీసుకెళుతున్న కార్పొరేటర్ ఈశ్వరమ్మ



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆధ్యాత్మికత పంచి.. సారెలతో పులకించి..



సారెను తీసుకువస్తున్న నటుడు కిరణ్ అబ్బవరం



సారె తీసుకొస్తున్న ప్రాణిక్ యోగాశ్రమం కైలాస్‌స్వామి



హథీరాంజీ మఠం ఆధ్వర్యంలో సారె..

తిరుపతి కల్చరల్: జాతర ఆరంభమైన మూడో రోజు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆధ్యాత్మిక నగరం తిరుపతి సారెలతో హోరెత్తింది. గాంధీ రోడ్డులోని హథీరాం మఠం ప్రతినిధి అర్జున్ దాస్ ఆధ్వర్యంలో గంగమ్మకు సారెను సమర్పించారు. అలాగే కుప్పం బాదూరు వద్దనున్న ప్రాణిక్ యోగా ఆశ్రమం ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రతినిధి కైలాస్ స్వామి గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దొడ్డారెడ్డి సిద్దారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, గురవారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, నరసింహ డప్పు విన్యాసాలు ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. 21వ డివిజన్ ఎస్వీ నగర్ కార్పొరేటర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో 500 మంది మహిళా భక్తులతో సారె ఊరేగింపు చేపట్టి అమ్మవారికి సమర్పించారు.